01ATP20F_01ATP20F.qxd 20-08-2025 PM 11:47 Page 1




అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 21 ఆగష్టు 2025 పేజీలు : 04


# పోలీసుల అదుపులో గంజాయి సరఫరా చేసే ఆరుగురు నిందితులు..?

- 10 కెజిల గంజాయి స్వాధీనం..?
- సోలాపూర్ టూ పుట్టపర్తికి దిగుమతి
- పుట్టపర్తి నుంచి ద్విచక్ర వాహనాల్లో కదిరికి సరఫరా
- 24 గంటలు గడుస్తున్నా వివరాలు వెల్లడించని పోలీసులు

**కదిరి, ఆగస్టు 20 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం గంజాయి నివారణకు కఠిన చర్యలు తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం విచ్చల విడిగా గంజాయి సరఫరా చేస్తూ యువత దానికి బానిసై పక్కదోవ పడుతున్నారు. ఒకవైపు పోలీసులు వివిధ శాఖల అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ అందుకు భిన్నంగా కొందరు విచ్చల విడిగా గంజాయిని సేవిస్తున్నారు. మరోవైపు సోలార్ నుంచి పుట్టపర్తికి బిక్షగాళ్ల రూపంలో గంజాయి తీసుకొచ్చి కదిరి ప్రాంత వ్యక్తులకు అందజేసి తిరుగు ప్రయాణం అవుతున్నట్లు తెలుస్తోంది. దిగుమతి అయిన గంజాయిని కదిరికి ద్విచక్ర వాహనాలు, కార్లలో సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు గుప్పు మంటున్నాయి. మంగళవారం రాత్రి కదిరి యుపిఎస్ పోలీసులు వాహనాల తనిఖీ (వేరువేరు చోట్ల) పుట్టపర్తి నుంచి కదిరికి వచ్చే వాహనాలను పక్కా సమాచారంతో తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో కదిరికి చెందిన ఆరు మంది నింధితులు గంజాయి తీసుకొస్తు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి సుమారు 8 నుంచి 10 కెజిల గంజాయితోపాటు విలువైన ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇందులో కీలక పాత్ర కదిరికి చెందిన హోటల్ యజమాని ఉన్నట్లు తెలుస్తోంది. గంజాయి నింధితులను అదుపులోకి తీసుకుని 24 గంటలు గడుస్తున్నప్పటికీ పోలీసు శాఖ అధికారులు వివరాలను వెల్లడించలేదు. ఇందులో రెండో చోట తనిఖీ చేసి పట్టు బడిన నింధితులను తప్పించేందుకు భారీ ప్రయత్నాలతోపాటు రాజకీయ ఒత్తిళ్ల జరుగుతున్నట్లు సమాచారం. కదిరిలో ఉండే ఇద్దరు కీలక వ్యక్తులను అదుపులోకి తీసుకుంటే కదిరి పట్టణంలోనే గంజాయిని నివారించ వచ్చని సమాచారం వ్యక్తమవుతోంది. అయితే పోలీసుల వాదన మాత్రం మరోలా ఉంది. సిడిఆర్ వస్తే తప్పా ఇందులో ఎవరు కీలక పాత్ర వహిజంచారన్న విషయం బయట పడుతుందని పోలీసులు అంటున్నారు. పోలీసుల మెరుపుదాడిలో పట్టుబడిన నింధితులను గంజాయి సరఫరా చేసే కదిరి ప్రాంతానికి చెందిన ఓ ముఠాను తప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు విమర్శలు గుప్పు మంటున్నాయి. ఏది ఏమైనప్పటికీ పోలీసులు పూర్తి స్థాయిలో విచారించి ఇందులో కీలక పాత్ర పోషించిన నింధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# రూ.40కోట్లతో 80 ఎకరాల్లో ఎంఐజి లేఔట్ ఎన్‌టిఆర్ స్మార్ట్ టౌన్‌షిప్

- మధ్యతరగతి ప్రజలకు అనుగుణంగా అధునాతన సదుపాయాలు కల్పనే ధ్యేయం
- ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలసి అహుడా చైర్మన్ టి.సి.వరుణ్‌లు నిర్మాణాలకు భూమిపూజ





శిలాఫలకాన్ని అవిష్కరించిన అనంతరం భూమి పూజ చేసి పనులనుప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, అహుడా చైర్మన్ తదితరులు

**అనంతపురం ఆగస్టు 20 ప్రభాతవార్త**

రూరల్ మండల పరిధిలోని కందుకూరు సమీపంలో 80 ఎకరాల విస్తీర్ణంలో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించే ఎంఐజి లేఅవుట్ ఎన్‌టిఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌కు బుధవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతో కలిసి అహుడా చైర్మన్ టి.సి. వరుణ్‌లు భూమిపూజ చేసి, శిలాఫలకాన్ని అవిష్కరించి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అహుడా చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మధ్యతరగతి ప్రజలకు అనుగుణంగా అధునాతన సదుపాయాలు కల్పి ంచే తరహాలో నిర్మాణాలకు శ్రీకారం చుడుతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పురపాలక శాఖామంత్రి నారాయణ అందిస్తున్న సహకారంతో అహుడా ఆధ్వర్యంలో సుస్థిర అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అహుడా ప్లానింగ్ అధికారి ఇషాక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దుష్యంత్, రాప్తాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ సాకె పవన్ కుమార్, నగర అధ్యక్షుడు పొదిలి బాబూరావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు సంజీవరాయుడు, ఇండ్ల కిరణ్ కుమార్, అవుకు విజయకుమార్, ముప్పూరు కృష్ణ,లతో పాటు అహుడా అధికారులు, జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# ముందుకు సాగని గృహనిర్మాణాలు..!

- నెలాఖర్‌కు 9711 గృహనిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యం
- ఇప్పటి వరకు కేవలం 5552 మాత్రమే పూర్తి
- ఇక తొమ్మిది రోజులే గడువు




**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 ప్రభాతవార్త**

గృహనిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎడాదికి పైగా నిర్మాణాలు కొనసాగుతున్నప్పటికీ కేవలం 57.17 శాతం మాత్రమే నిర్మాణాలు పూర్తి అయ్యాయి. ఇంకా 42.83 శాతం నిర్మాణాలు జరగాల్సి వుంది. నిర్మాణాలను ప్రభుత్వం ఇచ్చిన గడువు ఈ నెలాఖర్‌కు ముగియనుంది. దీంతో ఏమి చేయాలి తెలియక గృహనిర్మాణ శాఖ అధికారులు, ఉద్యోగులకు తలలు పట్టుకుంటున్నారు.

ప్రధానమంత్రి అవాస్ యోజన గృహనిర్మాణ పథకం కింద అనంతపురం జిల్లాలో గత ఎడాది జూన్ నుండి ఈ ఎడాది జూన్ 10వ తేదీ నాటికి 9711 గృహనిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. ఒక గృహ నిర్మాణంకు కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, అర్బన్‌లో అయితే రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేలు, రూరల్‌లో అయితే కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథ కం కింద రూ.30 వేలు చెల్లిస్తుంది. లబ్దిదారులకు ఆర్థికభారం తగ్గించాలనే మంచి ఉద్దేశ్యంతో అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు 75 వేల రుపాయిలను చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం ఇచ్చిన గడువు నాటికి లక్ష్యం చేసుకోలేదు. దీంతో ప్రభుత్వం జూలై వరకు గడువును పొడిగించింది. అప్పటికి లక్ష్యం చేరుకోకపోవడంతో ఆగస్టు ఆఖర్ వరకు గడువును పొడిగించింది. అయితే ఈనెల 20వ తేదీ నాటికి 5552 గృహనిర్మాణాలు (57.17 శాతం)

మిగతా 4లో...

# రైల్వే ట్రాక్ పై ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలించండి

- కేంద్ర రైల్వే మంత్రిని కోరిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

**శ్రీ సత్యసాయి జిల్లా, ఆగస్టు 20, ప్రభాతవార్త ప్రతినిధి**

అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలోని దొనుముక్కల, తిమ్మాపురం, కోనకొండల, జి.కొట్టల గ్రామాల రైతులు ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణంతో భూములు కోల్పోయారని, ఇప్పుడు ప్రతిపాదిత రైల్వే ట్రాక్ వారి పంట పొలాల మీదుగా వెళ్ళితే జీవనోపాధి దెబ్బతింటుందని , కావున రైల్వే ట్రాక్ మార్గాన్ని పునరాలోచించి, రైతులకు నష్టం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కేంద్ర రైల్వే మరియు జలశక్తి సహాయ మంత్రి వి.సోమన్న కు అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ అభ్యర్థించారు. బుధవారం న్యూ ఢిల్లీలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర రైల్వే మరియు జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమన్నను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ రెండు ప్రధాన అంశాలపై మంత్రికి వినతి పత్రాలు సమర్పించారు. రైతుల భూములపై ప్రతిపాదిత రైల్వే ట్రాక్ సమస్య, అలాగే నర్సాపురం – ధర్మవరం ఎక్స్‌ప్రెస్ (17247/17248) రైలు పొడిగింపు గురించి విన్నవించారు. ప్రస్తుతానికి ఈ రైలు ధర్మవరం వరకు మాత్రమే నడుస్తుందని, గుంతకల్లు వరకు పొడిగిస్తే అనంతపురం, గుంతకల్లు ప్రజలకు తిరుపతి, నెల్లూరు, ఒంగోలు ప్రాంతాలకు సులభ కనెక్టివిటీ కలుగుతుందని ఎంపీ పేర్కొన్నారు. ఈ పొడిగింపు వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు లాభపడటమే కాకుండా, ప్రాంతీయ వాణిజ్యం, పర్యాటకం, ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. ధర్మవరం – గుంతకల్లు మధ్య ఇప్పటికే డబుల్ లైన్ ఎలక్ట్రిఫైడ్ ట్రాక్ ఉండటంతో సాంకేతికంగా కూడా ఇది సాధ్యమేనని తెలియజేశారు. అలాగే హైదరాబాద్(కాచిగూడ) నుండి బెంగళూరు (యశ్వంతపూర్) వెళ్లే 20703/20704 వందే భరత్ రైలుకి హిందూపురం రైల్వే స్టేషన్ నందు హాల్టు కల్పించినందుకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న కు ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగిందన్నారు. అనంతపురం ప్రజల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి ఎంపీకి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత కె.సి హరి, సర్పంచ్ శ్రీరాములు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర రైల్వే మంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

# పెద్దారెడ్డికి తప్పని నిరీక్షణ

- తాడిపత్రిలో ప్రవేశానికి మరి కొంతకాలం బ్రేకు
- సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపేసిన డివిజన్ బెంచ్






**తాడిపత్రి, ఆగస్టు 20, ప్రభాతవార్త**

దాదాపు ఏడాదిన్నర కాలంగా తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేస్తున్న న్యాయపోరాటం ఇంకా ఫలించలేదు. ఈ నెల 18న తాడిపత్రికి పెద్దారెడ్డి వెళ్లవచ్చని, పోలీసులు తగిన భద్రత కల్పించాలని ఏక సభ్య ధర్మాసనం ఈ నెల 14న ఇచ్చిన ఉత్తర్వులను ద్విసభ్య ధర్మాసనం తదుపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు బుధవారం నిలిపివేసింది.

ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను అనుసరించి గత సోమవారం పోలీసులు పెద్ద ఎత్తున బలగాలను మోహరించి కోర్టు ఆదేశాలను అమలు చేసేందుకు ప్రయత్నించారు. అయితే అదే రోజు జస్టిస్ హరినాథ్ ఎన్.తో కూడిన ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన (సీసీ నం.1472-2025)ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రతివాదులైన తాడిపత్రి పట్టణ సీఐ సాయిప్రసాద్, అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్‌లు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించారు. కోర్టు ధిక్కరణ కేసును పున:పరిశీలించాలని, శాంతి భద్రతల దృష్ట్యా తాడిపత్రిలోకి పెద్దారెడ్డి ప్రవేశాన్ని మరికొంత కాలం వాయిదా వేయాలని వారిద్దరూ న్యాయస్థానాన్ని కోరినట్లు తెలిసింది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తర్వాత జస్టిస్ భట్టు దేవానంద్, హరిహరనాథ్ శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను తదపరి ఉత్తర్వులు వెలువడేంత వరకు నిలిపివేస్తూ బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మరికొంత కాలం కేతిరెడ్డి పెద్దారెడ్డికి నిరీక్షణ తప్పేట్టు లేదు. వేచి చూసే ధోరణిలో ఉండాలా సుప్రీంకోర్టు మెట్లు ఎక్కాలా అని పెద్దారెడ్డి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. తమ న్యాయవాదుల సూచనల మేరకు ముందుకు వెళ్లాలని చూస్తున్నట్లు సమాచారం.

# ఆల్ ఇండియాలో 1,330 ర్యాంక్ సాధించిన అనంత విద్యార్థి

**అనంతపురం బ్యూరో, ఆగస్టు 20 ప్రభాతవార్త**



జి.శ్రీక్రిష్ణ

నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) పీజీ 2025 పరీక్షలో అనంతపురానికి చెందిన విద్యార్థి జి.శ్రీక్రిష్ణదేవరాయల్ ఆల్ ఇండియాలో 1,330 ర్యాంకు సాధించాడు. 800 మార్కులకు గాను 621 మార్కులు సాధించి ఔరా అనిపించుకున్నాడు. జి. వెంకటరమణ (లేట్), కె. శోభారాణి దంపతుల తనయుడైన జి.శ్రీక్రిష్ణదేవ రాయల్ అకుంఠిత దీక్ష, పట్టుదలతో పరీక్ష రాసి ఈ ఘనత సాధించాడు. 2024లో జరిగిన నీట్ ప్రవేశ పరీక్షకు హాజరు కావడానికి వెళ్లిన జి.శ్రీక్రిష్ణదేవరాయల్ ఆలస్యంగా వచ్చాడని నాడు పరీక్ష రాయనివ్వలేదు. దీంతో మరింత కసిగా పరీక్షకు సిద్ధమై 2025 నీట్ ప్రవేశ పరీక్షకు హాజరై అందరూ ముక్కున వేలేసుకునేలా అఖిల భారత స్థాయిలో మెరిశాడు. జి.శ్రీక్రిష్ణదేవరాయల్ అత్యుత్తమ మార్కులు సాధించడంతో ఆయనను అందరూ అభినందిస్తున్నారు. పట్టుదల, దీక్ష ఉంటే ఏదైనా సాధించగలరని జి.శ్రీక్రిష్ణదేవరాయల్ నిరూపించాడని కొనియాడుతున్నారు.

## అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వ్యవహారంలో

# పార్టీ అధిష్టాన వర్గం సీరియస్

- వారం రోజుల్లో త్రీ మెన్ కమిటీ లేదా నియోజకవర్గ ఇన్చార్జి నియామకం ? - ఎమ్మెల్యే దగ్గుబాటి పై పార్టీ అధిష్టాన వర్గానికి ఫిర్యాదులు
- చంద్రబాబుతో వేరువేరుగా భేటీ అయిన ఎమ్మెల్యే దగ్గుబాటి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి
- ఆ ఆడియోలో ఎమ్మెల్యే మాట్లాడింది నాతోనే అని స్పష్టం చేసిన ధనంజయ నాయుడు
- ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ చెప్పకపోతే మా తడాఖా ఏంటో చూపిస్తాను అన్న జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం



ఎమ్మెల్యే దుగ్గబాటి



మాట్లాడుతున్న ఎన్టీఆర్ అభిమానులు



ధనంజయ నాయుడు

**అనంతపురం, ఆగస్టు 20, ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ పై తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం సీరియస్ అయింది. అనంతపురం నియోజకవర్గంలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న వివాదాలు, తాజాగా జూనియర్ ఎన్టీఆర్ ను, ఆయన తల్లిని దుర్భాషలాడుతూ అనంతపురం ఎమ్మెల్యే కు సంబంధించి ఆడియో వైరల్ అయిన సంఘటనపై తెలుగుదేశం పార్టీ అధిష్టానవర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు తెలియ వచ్చింది. ఒకవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు నిరసనలకు దిగుతుండడం మరోవైపు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే వ్యవహార శైలి పార్టీ కార్యకర్తల్లో చర్చనీయాంశం కావడం నేతలకు తలనొప్పిగా మారింది. ఈ నేపథ్యంలో బుధవారం పార్టీ ముఖ్యులు కలవాలని ఆదేశించడంతో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటప్రసాద్, అనంతపురం మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి వేరువేరుగా సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర పార్టీ పెద్దలను కలిసినట్లు సమాచారం.. జూనియర్ ఎన్టీఆర్ సంబంధించి ఆడియో వైరల్ పైన, అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సంఘటన పైన సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా ఎమ్మెల్యే దగ్గుబాటిపై సీరియస్ అయినట్లు తెలియ వచ్చింది. ఇదే సమయంలో మంగళవారం రోజు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ను అనంతపురం మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ప్రత్యేకంగా కలిసి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ వ్యవహార శైలిపై ఫిర్యాదు చేసినట్లు తెలియ వచ్చింది.. ఎమ్మెల్యే కొందరిని బెదిరించారని, మూడు, నాలుగు ఆడియో రికార్డులు కూడా అందజేసినట్లు తెలియ వచ్చింది. సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర పార్టీ పెద్దలకు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి అనంతపురం అర్బన్ లో నెలకొన్న పరిస్థితులను ఆధారాలతో ప్రస్తావించినట్లు తెలియ వచ్చింది.. ఈ నేపథ్యంలో టిడిపి రాష్ట్ర నాయకత్వం అనంతపురం అర్బన్ స్థానం విషయంలో ఈ నెలాఖరులోగా నియోజకవర్గ ఇన్చార్జిని నియమించడం లేదా త్రీ మెన్ కమిటీని వేయడం లాంటి చర్యలకు దిగే అవకాశం ఉందని తెలియ వచ్చింది.. ఆ ఆడియోలో ఎమ్మెల్యే మాట్లాడింది నాతోనే... ధనంజయ నాయుడు. ఇటీవల జూనియర్ ఎన్టీఆర్ నటించిన వార్ 2 సినిమా రిలీజ్ నేపథ్యంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ నాతోనే ఫోన్లో మాట్లాడాడని, జూనియర్ ఎన్టీఆర్ తల్లి శాలి నీ దుర్భాషలరాలని, వార్ 2 సినిమా అనంతపురంలో ఎట్లా ఆడుతాలో చూస్తానని బెదిరించినట్లు టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు, జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘాల నాయకుడు ధనుంజయ్ నాయుడు వెల్లడించారు. ఓ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనంతపురం జిల్లాకు చెందిన ధనంజయ నాయుడు ఆ ఆడియో వైరల్ వ్యవహారంపై స్పష్టంగా వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యే నాతో ఫోన్లో అన్ని ఆధారాలు ఉన్నాయని, నా ఫోన్లోనే ఆడియో రికార్డ్ చేశానని, మా అభిమాని నాయకుడు జూనియర్ ఎన్టీఆర్ తల్లిని తిడుతుంటే ఉండలేక రికార్డ్ చేసినట్లు వెల్లడించారు. నేను పక్కాగా తెలుగుదేశం పార్టీ కు చెందిన వారిని అని, వైసీపీ ప్రభుత్వంలో నాకు 24 కేసులు కూడా పెట్టారని ఆయన గుర్తు చేశారు.. టిడిపిలో పనిచేస్తూనే జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘంలో కీలకంగా ఉన్నట్లు ఆయన వివరించారు.. ఈ వ్యవహారంలో నా భార్యకు, నా సోదరునికి ఎమ్మెల్యే మనుషులు ఫోన్ చేసి బెదిరించారని, ఆ ఆడియో తప్పని, ఆ ఆడియో ఏఐ క్రియేట్ చేసింది అని నేను చెప్పాలని నా కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చినట్లు ధనుంజయ నాయుడు ఓ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ఆ వీడియో కూడా వైరల్ గా మారింది. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం హెచ్చరిక.. జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘ నాయకులు బుధవారం హైదరాబాదులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జూనియర్ ఎన్టీఆర్ తల్లి శాలినీకి అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని, అభిమాన సంఘాలు తమ ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.. అనంతపురంలో తమ సంఘ నాయకులు సమావేశం ఏర్పాటు చేయకపోతే పోలీసులు అడ్డుకున్నారని, విజయవాడలో కూడా తమ వారికి అదే పరిస్థితి వచ్చింది అని తప్పనిసరి పరిస్థితుల్లో హైదరాబాదులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు వారూ వివరించారు. నేను పాడే ఎక్కేవరకు తెలుగుదేశం పార్టీలో ఉంటారని జూనియర్ ఎన్టీఆర్ గతంలో ప్రకటించారని ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు గుర్తు చేశారు.

# అట్టహాసంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం

- కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇస్తాం - ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం - టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్







మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రతాప్ ప్రమాణస్వీకారం చేస్తున్న దృశ్యం, ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం, పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**గుత్తి, ఆగస్టు 20 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకై కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగు గుర్తింపు ఇచ్చి పదవులను కట్టబెడతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టిడిపి జిల్లా అధ్యక్షులు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్‌లు స్పష్టం చేశారు. ఇచ్చిన హామీ మేరకు రైతుల సంక్షేమం దృష్ట్యా అన్నదాత సుఖీభవ పథకం మేరకు తొలి విడతగా 7 వేల రూపాయలు రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసిందని వారు పేర్కొన్నారు. గుత్తి పట్టణంలో బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటి నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన గుర్రాల సూర్యప్రతాప్‌నాయుడు, వైస్‌చైర్మన్‌గా పామిడికి చెందిన మాలిక్‌బాషాలతో మార్కెట్ యార్డ్ కార్యదర్శి బాలాజీరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కమిటీ డైరెక్టర్లుగా సుబ్బలక్ష్మి, హరికృష్ణ, భారతి, నాగవీరమ్మ, బావిగడ్డ ఓబులయ్య, మిద్దె ఓబులేసు, రంగారెడ్డి, లక్ష్మి, సరస్వతి, వెంకటేష్, కృష్ణాబాయి, కవిత, నాగేశ్వరరావులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అంతకుమునుపు టిడిపి శ్రేణులు కూటమి నాయకులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గాంధీచౌక్ వద్ద ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు గజమాలలతో ఘన స్వాగతం పలికారు. గాంధీచౌక్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా మార్కెట్ యార్డ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. బాణసంచా పేలుళ్లతో పట్టణం దద్దరిల్లింది. ర్యాలీ కారణంగా పట్టణంలో భారీగా ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు నూతన మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రతాప్‌నాయుడు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్ కమిటీలు, అలంకారప్రాయంగా మారాయని వారు విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వంలో రైతులకు పూర్తి సహకారం అందించి వారి పంటల కొనుగోలుకు తాము తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. రైతన్న సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగు గుర్తింపు వుంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తి, గుంతకల్లు, ఇన్‌చార్జ్‌లు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు ఈశ్వర్, బిజెపి జిల్లా అధ్యక్షులు కొనుకొండ్ల రాజేష్, హనుమత్‌చౌదరి, జనసేన నియోజకవర్గ కన్వీనర్ వాసగిరి మణికంఠ, పార్టీ కన్వీనర్లు ఎంకె చౌదరి, బద్రివలి, టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీన, రమేష్, జక్కలచెరువు గోవిందు, న్యాయవాది సోమశేఖర్, బిజెపి మహిళా కన్వీనర్ హేమలత, జనసేన కన్వీనర్లు, సురేష్ రాయల్, వెంకటేశ్వర్లు, తొండపాడు సొసైటీ అధ్యక్షుడు నంద్యాల శివశంకరయాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రభాకర్‌చౌదరి, సర్పంచు భరత్, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్, నాయకులు లక్ష్మణ్‌చౌదరి, రియాజ్, శ్రీనివాసచౌదరి, నారాయణస్వామి, చెరుకూరి లక్ష్మణ్, గుత్తి ఆర్ఎస్ రాజా, గుత్తి, గుంతకల్లు, పామిడి, మండలాల టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



పెద్దసంఖ్యలో కార్యకర్తలు హాజరైన దృశ్యం



# కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానిని కలిసిన ఆర్థిక మంత్రి పయ్యావుల

-ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వివిధ అంశాలపై చర్చ

**ఉరవకొండ, ఆగస్టు 20 ప్రభాతవార్త**

కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్‌శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కలిసారు. దేశ రాజధాని న్యూ ఢిల్లీలో బుధవారం కేంద్ర మంత్రిను ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన మంత్రి పయ్యావుల కేశవ్ పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించినట్లు సమాచార పౌర సంబంధాలశాఖ తెలిపింది.

02ATP20_02ATP20.qxd 20-08-2025 PM 11:52 Page 1



## ఒంగోలులో జరుగుతున్న సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- బిజెపికి తొత్తుగా మారిన జాతీయ ఎన్నికల కమిషన్
- సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం
- సిపిఐ కార్యాలయంలో రాష్ట్ర మహాసభల గోడ పత్రికల ఆవిష్కర



ఒంగోలు సిపిఐ మహాసభల గోడపత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

**కళ్యాణదుర్గం, ఆగస్టు 20 ప్రభాతవార్త**

దేశంలో జాతీయ ఎన్నికల కమిషన్ పై ప్రజలలో విశ్వాసం సన్నగిల్లిందని, ఎన్నికల కమిషన్ బిజెపికి తొత్తుగా మారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ సహాయ కార్యదర్శి నరసింహులు ఆరోపించారు. బుధవారం కళ్యాణదుర్గంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ఓంకార్ సహాయ కార్యదర్శి బుడెన్ మండల సహాయ కార్యదర్శి శ్రీనివాస్ నాయక్ తో కలిసి సిపిఐ 28వ మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 23 నుండి 25 దాకా ఒంగోలు నగరంలో సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు ను జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులు లకు పిలుపునిచ్చారు. దేశంలో బిజెపి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను అస్తగతం చేసుకొని, రాజ్యాంగ, ప్రజాస్వామ్యం, లౌకిక పునాదులను ధ్వంసం చేస్తున్నది అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని వారు ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి విచ్చలవిడిగా పెరిగిందని, మహిళలపై దాడులు అరికట్టడంలో విఫలమైందని వారు అన్నారు. మూడు రోజులపాటు జరుగుతున్న సిపిఐ రాష్ట్ర మహాసభలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పైన చర్చించి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పలు తీర్మానాలు ఆమోదిస్తామన్నారు. ఈనెల 23న జరిగే బహిరంగ సభకు పార్టీ శ్రేణులు ప్రజలు సానుభూతిపరులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు

## ఇళ్లను పడగొట్టరాదని మహిళలు ప్రధాన రహదారిపై ధర్నా

- మీకు తగిన న్యాయం చేస్తాం - తహశీల్దార్





గ్రామస్తులకు నచ్చచెబుతున్న తహశీల్దార్ రోడ్డుపై బైటాయించిన మహిళలు

**లేపాక్షి, ఆగస్టు 20 ప్రభాతవార్త**

మండలంలోని బిసలమానేపల్లి గ్రామంలో జాతీయ రహదారి వెడల్పు సందర్భంగా బుధవారం రహదారి సర్వేకు సర్వేయర్లు వచ్చారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఎలా వచ్చారని బాధిత కుటుంబం మహిళలు సర్వేయర్లపై ధ్వజమెత్తారు. వెంటనే రహదారిపై కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు నచ్చజెప్పినా వినకపోవడంతో తహశీల్దార్ సౌజన్యలక్ష్మి ఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా వందలాది వాహనాలు నిలిచిపోయాయి. చివరకు తహశీల్దార్ గతంలోనే ఇళ్లకు సంబంధించిన నష్టపరిహారం అందజేశామని పేర్కొన్నారు. నాలుగేళ్ల క్రితం తమకు నష్టపరిహారం అందజేశారని, అప్పట్లో కొద్దిగా మాత్రమే ఇళ్లను తొలగిస్తామని పేర్కొన్నారన్నారు. ఇందుకు తహశీల్దార్ మాట్లాడుతూ మీకు అవసరమైన ఇంటి పట్టాలు అందజేస్తామని రహదారి నిర్మాణానికి అడ్డు తగలకూడదని నచ్చ చెప్పారు. ఆయినా బాధిత మహిళలు తమకు అప్పట్లో ఇచ్చిన నష్టపరిహారం సరిపోవడంలేదని నష్టపరిహారాన్ని మరింత పెంచాలని తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. తమ పరిధిలో న్యాయం చేస్తామని బాధిత మహిళలకు తహశీల్దార్ తెలిపారు.

## వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించండి

**అమరాపురం ఆగస్టు 20 ప్రభాతవార్త**



ఎంపీపీ ఈరన్న

అమరాపురం మండలంలో వికలాంగుల పింఛన్లు దాదాపు 182 రద్దు అయినట్లు ప్రభుత్వం తక్షణం వికలాంగుల పింఛన్లను పునరుద్ధరించి న్యాయం చేయాలని అమరాపురం ఎంపీపీ ఈరన్నప్రభుత్వానికి విన్నవించారు. ముఖ్యంగా 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో వికలాంగుల పింఛన్లు మంజూరై వాటికి 2011లో మరియు 2014లో కూడా చంద్రబాబు ప్రభుత్వంలో పింఛన్లు పొందారని, అదేవిధంగా 2019 జగన్ ప్రభుత్వంలో కూడా పింఛన్లను ఇదే వికలాంగులు సదరం సర్టిఫికెట్ల ద్వారా పింఛన్లు పొందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రీ వెరిఫికేషన్ పేరిట సదరం క్యాంపులో నిర్వహించడంతో ఇందులో గతంలో కన్నా తక్కువ వైకల్యం కలిగినట్లు సర్టిఫికెట్లు జారి కావడంతో అర్హత కలిగిన వికలాంగులతో పాటు బెడ్ రెస్ట్ కలిగినటువంటి వారు, కిడ్నీ, తలసేమియా వంటి వారు కూడా నష్టపోతున్నారని ప్రభుత్వం పునర్ ఆలోచించి వీరికి న్యాయం చేయాలని ఎంపీపీ కోరారు.

## తిలక్‌నగర్‌లో యువకుడు ఆత్మహత్య

**లేపాక్షి, ఆగస్టు 20 ప్రభాతవార్త**

మండలంలోని తిలక్‌నగర్‌లో కట్ట ఆకాష్ (26) అనే యువకుడు ఇంటిలో ఎవరూ లేని సమ యంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ సరఫుద్దీన్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కట్ట ఆకాష్ ఎలాంటి పనులకు వెళ్ల కుండా అల్లరి చిల్లరగా తిరిగేవాడన్నారు. తన తల్లి పలుమార్లు పనులకు వెళ్ళమని హితవు పలికే దన్నారు. మంగళవారం ఉదయం తల్లి భూ దేవమ్మను బెంగళూరుకు ట్రైన్ ఎక్కించి ఇంటికి వెళ్ళాడన్నారు. ఆ సమయంలో కూడా జాగ్రత్తగా ఏదో ఒక పని చేసుకోవాలని తల్లి కుమారునికి తెలిపిందన్నారు. బెంగళూరుకు వెళ్లిన తరువాత ఆకాష్ తల్లి పలుమార్లు ఫోన్ చేసినా ఎత్తలేదన్నారు. రాత్రి బెంగళూరు నుండి అతని తల్లి ఇంటికి వచ్చి పిలవగా వాకిలి తీలేదన్నారు. దీంతో చుట్టుపక్కల వారు తాళాలను పగులగొట్టి చూడగా ఆకాష్ ఇంటి పైకప్పుకు ఉరి వేసుకున్నాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.



ఆత్మహత్య చేసుకున్న ఆకాష్

### ఉగ్రవాదుల సమాచారం అందితే

## పోలీసులకు తెలియజేయండి..!

**ధర్మవరం రూరల్ ఆగస్టు 20 ప్రభాతవార్త**

ధర్మవరం పట్టణము, రూరల్ ప్రాంతాలలో పాకిస్తాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లుగా లేదా ఉగ్రవాదానికి ప్రేరేపించే వ్యక్తులు ఎక్కడైనా అనుమానితులుగా కనిపిస్తే వెంటనే వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని డిఎస్పీ హేమంత్ కుమార్ తెలిపారు. డి .ఎస్.పి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రత్న ఆదేశాల మేరకు సమాచారము ఇచ్చిన వారి పేరును గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా ఉగ్రవాదుల సమాచారం తెలిపిన వారికి పోలీస్ శాఖ తరపున బహుమతులు అందజేస్తామని తెలిపారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ. సెల్ నెంబర్ 9440796831 కు గాని టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ.6305800 429కు గాని రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ. 9440796832 గాని సమాచారాన్ని అందించాలని తెలిపారు. ప్రజలు పోలీసులతో తమ సహాయ సహకారాలను అందించాలని తెలిపారు.

## సకాలంలో సస్యరక్షణ చేపట్టండి అధిక దిగుబడును సాధించండి

- పాలసముద్రం ప్రాంత...పంట పొలాల్లో శాస్త్రవేత్తలు



పంట పొలాల్లో శాస్త్రవేత్తలు

**గోరంట్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త**

రైతులు సాగు చేసుకుంటున్న పంటల సస్యరక్షణపై గోరంట్ల మండలం వ్యవసాయాధికారి శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో రైతులకు పంట పొలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలోని పాలసముద్రం పంచాయితీ రాగిమాకులపల్లి గ్రామంలో కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ భాస్కర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసచారి మొక్కజొన్న, వేరుశనగ పంట పొలాలలను సందర్శించారు. మొక్కజొన్నలో జింక్ లోపం సవరణకు చిలేటెడ్ జింక్ 2 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని 2 సార్లు పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే వేరుశనగలో జింక్, ఐరన్‌లోపం నివారణకు చిలేటెడ్ జింక్, చిలేటెడ్ ఐరన్‌ను 2 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. ఆకుమచ్చ తెగులుకు మంకోజాబ్ 2.5 గ్రాములు లేదా కస్టోడియా 1.5 ఎంఎల్ లీటర్ నీటికి కలుపుకొని పిచికారీ చేసుకోవాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు బాలకృష్ణ, మూర్తి, ఆనందప్ప, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## సొసైటీలో...రవి తొలి సంతకం

-గౌనివారిపల్లి సింగిల్ విండో అధ్యక్షునిగా రవిమోహన్ బాధ్యతల స్వీకారం

**గోరంట్ల, ఆగస్టు 20 ప్రభాతవార్త**



తొలి సంతకం చేసి బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్

గోరంట్ల మండలంలోని గౌనివారిపల్లి సింగిల్ విండో అధ్యక్షునిగా నియమితులైన శీనప్పల్లి గ్రామానికి చెందిన టిడిపి నేత రవిమోహన్ బుధవారం సాకార సొసైటీలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రికార్డులో సంతకం చేసి సహకార సొసైటీకి చెందిన రైతులకు సంబంధించిన పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమ్మలవాండ్లపల్లి పసుపులేటి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## భూగర్భ జల మట్టాన్ని పెంచడానికి కృషి చేయండి



సమావేశపు దృశ్యం

**అమరాపురం ఆగస్టు 20 ప్రభాతవార్త**

మండలంలోని చెరువు సాగునీటి సంఘం పరిధిలో భూగర్భ జల మట్టాన్ని పెంచడానికి కృషి చేయాలని అమరాపురం ఎంపీడీవో రామారావు, ఇరిగేషన్ ఏఈ భార్గవ్ లు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు 14 సాగునీటి సంఘాల అధ్యక్షులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని ఇరిగేషన్ ఏఈ అధ్యక్షతన నిర్వహించా రు. ఈ సందర్భంగా ఏఈ భార్గవ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు మండలంలోని ఇరిగేషన్ పరిధిలోని పైలెట్ ప్రాజెక్టు కింద చెరువుల అభివృద్ధితోపాటు చెరువుల క్రింద అదనంగా ఉన్న చిన్న కుంటలు చెరువులు కూడా రెవిన్యూ గ్రామాల పరిధిలో ఆయా సాగునీటి సంఘాల పరిధిలోకి వస్తాయని వీటి అభివృద్ధి పైన కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా జలమట్టాన్ని పెంచడానికి తీసుకువచ్చిన చర్యలు మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత సాగునీటి సంఘాల అధ్యక్షులు నివేదిక రూపంలో సమర్పిస్తే దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే విధంగా జాతీయ ఉపాధి హామీ పథకం పరిధిలో రైతు పొలాల్లో ఉన్న చిన్న చిన్న కుంటల అభివృద్ధి పరచడానికి గుర్తించి మరమ్మత్తు చేపట్టాలని ఆయన కోరారు. అదేవిధంగా చెక్ డ్యాములు డిసిల్టింగ్ తదితర కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాన్ని పెంచడానికి కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఏపీవో శివన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ముఖ్యంగా చెరువు సంఘాల అధ్యక్షులు నరసింహమూర్తి ,గురసిద్ధప్ప, తిప్పేస్వామి, మంజునాథ్, శివరామప్ప, ఈరమల్లప్ప, ఈశ్వరప్ప, నిద్రగట్టస్వామి తదితరులు పాల్గొన్నారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు మాట్లాడుతూ ఆ చెరువుల పరిధిలో ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి నివేదికను అందజేస్తామని వారు పేర్కొన్నారు.

## మాజీ మావోయిస్టుల స్థలాలు వారికే అప్పగించాలి

**పుట్టపర్తి రూరల్ ఆగస్టు 20 ప్రభాతవార్త**

ధరణి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మాజీ మావోయిస్టులకు కేటాయించిన స్థలాలను వారికే అప్పచెప్పాలని ఆర్డిఓ సువర్ణకు వినతి పత్రం అందజేశారు. బుధవారం పుట్టపర్తి ఆర్డిఓ కార్యాలయం ముందు మాజీ మావోయిస్ట లు, వారి సానుభూతిపరులు ఆర్డీవో కార్యాలయం ముందు కొంతసేపు నిరసన తెలియజేశారు. పుట్టపర్తి మండల పరిధిలోని కప్పల బండ పొలం సర్వేనెంబర్ 3151 లో 488 ఎకరాలు భూమిని ఈ లక్ష్మమ్మతో ఏడున్నర లక్షల రూపాయలకు కొని ఒక్కొక్కరికి రెండున్నర సెంట్లు భూమిని కేటాయించి లాటరీ పద్ధతిలో 125 ప్లాట్లను మాజీ మావోయిస్టులు, వారి సానుభూతిపరులు, కొంతమంది పేదలు, కలసి పంచుకున్నామని, అందులో రెండు బోర్లు వేసుకున్నామని ఒక కమ్యూనిటీ హాల్ నిర్మించుకున్నామని, పట్టాల కోసం రెవెన్యూ వారిని విన్నవించుకున్నాము. అందులో పలువురు 2013లోనే ఇళ్లను నిర్మించుకున్నాము. 2019 వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అప్పటి ఎమ్మెల్యే, లోచర్ల విజయభాస్కర్ రెడ్డి ఇద్దరు కలిసి ఆ కాలనీ కబ్జా చేసి ఒక్కొక్క ప్లాటు ఐదు లక్షలకు,10 లక్షలకు అమ్ముకున్నారని, ఇదే విషయాన్ని మా దగ్గర ఉన్న ఆధారాలతో కోర్టుకు వెళ్లగా, తాసిల్దారు ,ఆర్ డి ఓ, జిల్లా కలెక్టర్కు ఎస్పీ గారికి తెలియజేశామని, ఆక్రమించిన కాలనీని మాకు అప్పజెప్పలేదని, అయినప్పటికీ ఎలాంటి న్యాయము మాకు జరగలేదని తెలిపారు. గతంలో కూడా ఆర్డిఓ కి ఇదే విషయాన్ని తెలియజేసామని, నిర్మాణాలను అడ్డుకోవడానికి వెళ్లిన ఆర్డీవోను సైతం రాజకీయ అండతో ఆనాడు వెనక్కి పంపారని, అందులో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపిన, నేటికీ ఒక వర్గం అందులో నిర్మాణాలు చేపడుతుందని వారు ఆర్డీవో దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వారి వద్ద ఉన్న ఆధారాలను ఆర్డీవో సువర్ణ చేతికి అందజేశారు. వీటిని పరిశీలించి చర్యలు తీసుకుంటారని ఆమె హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టు నాయకులు బాలరాజు నరేంద్రబాబు, కొట్టాల శ్రీరాములు, మనోహర్, బొంతలపల్లి శ్రీరాములు చలపతి రామమోహన్ శ్రీనివాసులు రామాంజనేయులు ,అంజినప్ప, కేశవరెడ్డి ,పెద్దన్న ,రామకృష్ణ, రాయుడు ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అటల్ బిహారి వాజ్‌పాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్ 2 ప్రారంభం

- టోర్నమెంట్ మొదటి రోజే ఉత్కంఠ భరిత ఆటతీరు



క్రికెట్ టోర్నమెంట్ను ఉద్దేశించి మాట్లాడుతున్న డిఎస్పి హేమంత్ కుమార్

**ధర్మవరం రూరల్ ఆగస్టు 20 రూరల్ ప్రభాతవార్త**

అటల్ బిహారి వాజ్‌పాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్2 బుధవారం ఆర్డిటి క్రీడా మైదానంలో ప్రారంభమైంది. ఈ టోర్నమెంట్ కు ముఖ్య అతిథులుగా బీజేపీ జిల్లా అధ్యక్షులు జి.ఎం. శేఖర్, మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు, ధర్మవరం డిఎస్పీ హేమంత్ కుమార్, ధర్మవరం మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఆర్‌డిటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ లు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌ను డీఎస్పీ హేమంత్ కుమార్ టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో పోతుకుంట బ్లూ కాప్స్ మరియు టీమ్ ఛత్రపతి జట్లు తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరులో పోతుకుంట బ్లూ కాప్స్ జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన తలారి మోహన్ కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. తరువాత బీజేపీ సీనియర్ నాయకులు శ్యామ్ రావు టాస్ వేసి రెండవ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో సేవ్ ఫార్మర్స్ జట్టు రాణించి బితివి, శ్రీ జట్టుపై 52 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో ఇర్ఫాన్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇరువురు జన్మదిన్న సందర్భంగా ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించడం ఎంతో గర్వకారణం. యువతలో క్రీడాస్ఫూర్తి, ఆరోగ్య చైతన్యం మరియు టీమ్ స్పిరిట్‌ను పెంపొందించడమే ఈ టోర్నమెంట్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. టోర్నమెంట్ సీజన్2లో మరిన్ని ఉత్కంఠ భరితమైన పోరులు జరగనున్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంలో ఈ టోర్నమెంట్ కీలక పాత్ర పోషిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు గోరంట్ల మోహన్ శేఖర్, మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు, దీఎశి హేమంత్ కుమార్, మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, శిదిగి స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణ, బిజెపి జిల్లా ప్రధానకార్యదర్శి ఓబులేసు, రూరల్ మండల అధ్యక్షులు చంద్ర, బత్తలపల్లి మండల అధ్యక్షులు భాస్కర్, ధర్మవరం ఆర్డిటి ఏ.టి.ఎల్. శ్రీనివాసులు, కోచ్ రాజశేఖర్, కోచ్ పృధ్వి, కోచ్ అనిల్, బిజెపి నాయకులు అంబటి సతీష్, శ్యామ్ రావు, బిల్లే శ్రీనివాసులు, పోతుకుంట రాజు, గంగాధర్, చిన్న లింగమయ్య, అంజి, కృష్ణాపురం జమీర్, సోమ్లా నాయక్, భాను,రాధమ్మ, మహాలక్ష్మి, శారద, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## కృష్ణుడు ఉత్సవ విగ్రహం గ్రామోత్సవం

**బత్తలపల్లి, ఆగస్టు 20 ప్రభాతవార్త**



కృష్ణుని పల్లకీని మోస్తున్న దృశ్యం

మండలం కేంద్రంలోని బత్తలపల్లి బీసీ కాలనీలోని జగలేటి నాగమణి, నాగేంద్ర ఇంటి వద్ద గత ఐదు రోజులుగా పూజలు అందుకున్న శ్రీకృష్ణుడు ఉత్సవ విగ్రహాలను బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఈ నెల 16వ తేదీన శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేడుకలను వైభవోపేతంగా జరుపుకున్నారు. బుధవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుని జన్మవృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. దీంతో శ్రీకృష్ణ జపంతో మార్మోగింది. అనంతరం శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కొలాటం, భజనలతో ఊరేగింపు కొనసాగింది. ఆనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

## మృతుడు బాబావలి కుటుంబానికి ఆర్థిక సహాయం



మృతుడు బాబావలి కుటుంబ సభ్యులకి ఆర్థిక సహాయం అందజేస్తున్న డీఈవో, ఏపీసి, టీచర్ల దృశ్యం

**కొత్తచెరువు ఆగస్టు 20 ప్రభాతవార్త**

కొత్తచెరువు మండల కేంద్రంలో ఎం ఆర్ సి లో పనిచేస్తున్న క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్ (సి ఆర్ ఎం టి) బాబావలి ఇటీవల ఆగస్టు ఏడో తేదీ గుండెపోటుతో మృతి చెందారు ఈ మేరకు సాయి భక్తులు కీర్తిశేషులైన సుందరవ ల్లి మేడం వారి సహచరులు సహకారంతో 18 వేల రూపాయలు ఆర్థిక సహాయం మృతుడు బాబావలి కుటుంబ సభ్యులకు డిఇఓ జి .కృష్ణప్ప ఏపీసి పి. దేవరాజ్ , సూపరిండెంట్ బలరాముడు ఉపాధ్యాయులు అందజేశారు కొన్ని సంవత్సరాలుగా సుందరవల్లి మేడం సత్యసాయి జిల్లాలోని అనేక పాఠశాలలకు పేద ప్రజలకు సహకారం అందించినట్లు ఉపాధ్యాయులు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఎ నుములపల్లి ఇంగ్లీష్ టీచర్ లక్ష్మీనారాయణ హెచ్ఎం శ్రీకాంత్ జయరామ్ ఆర్ చంద్ర గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

## మహాగణపతి, ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకలు

**ధర్మవరం రూరల్ ఆగస్టు 20 ప్రభాతవార్త**



పూజలందుకుంటున్న అభయాంజనేయుడు

పట్టణంలోని సంగమేశ్వర రోడ్డు సీతారామాంజనేయ ఆలయంలోని సన్నిధిలో ఈనెల 18వ తేదీ నుండి 20వ తేదీ వరకు మూడు రోజులపాటు విద్యా గణపతి విముఖ విగ్రహ ప్రతిష్ట, ధ్వజ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు ఆలయ చెలిమి జీర్ణోదరణ సంఘము, మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్లు బండారు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు మోహన్ స్వామి చంద్రమోళి స్వామి ఇరువురు స్వామివారికి వివిధ అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణ ప్రాణ ప్రతిష్ట తో పాటు శేష హోమాలు, పూర్ణాహుతి కార్యక్రమాలు, వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి పూజా కార్యక్రమాలు తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుందరేశ్, లక్ష్మీనాథ్, రంగనాయకులు, వెంకట నరసింహులు, హేమంత్ కుమార్ తో పాటు అధిక సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఎప్పుడూ అధికారంలోకి వచ్చిన మోసాలు అబద్ధాలతోనే వస్తారు

- ఎంపీటీసీ మహబూబ్ బీ.



రుద్రంపేటలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, ఆగస్ట్ 20 ప్రభాతవార్త**

చంద్రబాబు పాలనంతా అబద్ధాలు.. మోసాలేన్నాని ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని ఎంపీటీసీ మహబూబ్ బీ మండిప డ్డారు బుధవారం రుద్రంపేట పంచాయతీలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు ప్రైవేట్ ల్యాండ్ మరియు చైతన్య కాలనీలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ఎంపీటీసీ మహబూబ్ బీ,వైఎస్ఆర్సిపి రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, ఎంఎస్ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీమోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ కూటమి వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా పార్టీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, ఎల్ ఎస్ ఎస్ సేవా సంస్థ అధ్యక్షులు సాదిక్, రుద్రంపేట ఎంపీటీసీ మహబూబ్ బీ మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేయడం చంద్ర బాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. 2024 ఎన్ని కల్లో అనేక హామీలు ఇచ్చిన కూటమి నాయకులు.. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్న ఒక్క హామీ కూడా అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం లో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడితేకూటమి వైఫల్యాలను వివరిస్తున్న నాయకులుఆ పథకాలను సైతం నిలిపివేశారన్నారు. రుద్రంపేట పంచాయతీలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరా మిరెడ్డి సహకారంతో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్ర మాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో కాజా, శిక్షావలి, షాషావలి సిమ్మి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఆంద విత్తనాలు పంపిణీ

- ఏ డి ఏ అల్తాఫ్ అలీ ఖాన్,ఏ ఓ వెంకట కుమార్.



రైతులకు ఆముద విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

**అనంతపురం రూరల్, ఆగస్ట్ 20 ప్రభాతవార్త**

కార్డు యఫ్ పీ ఓ సంస్థ జాతీయ ఆహార భద్రత మిషన్ నూనె గింజల పథకం క్రింద ఆముదం విత్తనాల వేల్యూ చైన్ క్లస్టర్ ద్వారా రాప్తాడు శాసనసభ్యులు పరిటాల సునీత ఆదేశాల మేరకు బుధవారం కోడిమి గ్రామంలోని రైతు సేవ కేంద్రంలో ఉచితంగా పంపిణి చేశారు. కేంద్ర ప్రభుత్వం నూనె గింజల పంటల విస్తీర్ణం పెంచటం కోసం మరియు నాణ్యమైన నూనె ఉత్పత్తి జరిగేవిధంగాచేయడంకోసంఈకార్యకమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ సులోచనమ్మ, అనంతపురం సహాయ వ్యవసాయ సంచాలకులు అల్తాఫ్ అలీ ఖాన్, అనంతపురం వ్యవసాయ అధికారి ఏ వెంకట్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి మల్లికార్జున రైతు సేవ కేంద్ర సిబ్బంది సాయి ప్రమోద్ మరియు రైతులు శ్రీనివాస్,అనిల్ చౌదరి , రవీంద్ర,కార్డు సంస్థ నుంది అమరనాథ రెడ్డి,నిర్మల, భాస్కర్ పాల్గొన్నారు.

## జిల్లా మార్పుపై వస్తున్న వదంతులపై ఎమ్మెల్యే స్పందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేశవరెడ్డి

**పుట్టపర్తి టౌన్, ఆగస్టు 20, ప్రభాతవార్త**

శ్రీ సత్య సాయి జిల్లా కేంద్రం మార్పుపై వస్తున్న వదంతుల పైన స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి స్పందించాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి డి.ఎస్ కేశవరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, పుట్టపర్తి కేంద్రంగా కాకుండా హిందూపురానికి మారుస్తున్నారని వదంతులు రావడంతో జిల్లాలో అందరిలోనూ అలజడి, ఆందోళన మొదలైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి హయాంలో వచ్చిన జిల్లా కేంద్రాన్ని కేవలం హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ మెప్పు కోసం జిల్లా కేంద్రాన్ని తరలిస్తారని వదంతులు, ప్రచారాలు కొనసాగుతున్నయన్నారు. సత్యసాయి నడయాడిన పుట్టపర్తిని కాకుండా హిందూపురానికి జిల్లా కేంద్రం తరలిస్తామంటే ఊరుకునేది లేదని ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ మార్పు వదంతులపై వస్తున్న ప్రచారాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి గాని, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి కానీ మాట్లాడకపోవడం దారుణం అన్నారు. అసలు ఎమ్మెల్యే బాలకృష్ణపై ఎదురు మాట్లాడే దమ్ము ఈ జిల్లాలో టిడిపి నాయకులకు ఎవరికైనా ఉందా? అని ప్రశ్నించారు. ఈ విషయమై ప్రభుత్వం లేదా ఎమ్మెల్యే కానీ ప్రజలకు సరైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా తరలిపోకుండా పార్టీలకు అతీతంగా పనిచేయాలని రాస్తారోకోలు, ఆమరణ నిరాహార దీక్షకు సైతం సిద్ధంగా ఉంటామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, పట్టణ కన్వీనర్ రవి నాయక్, నాయకులు ఈశ్వరయ్య, కేశప్ప, బుక్కపట్నం ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, అగ్రి బోర్డ్ మాజీ చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, కౌన్సిలర్లు పవన్ కుమార్, చెరువు భాస్కర్ రెడ్డి, బిల్డర్ మల్లికార్జున, రాష్ట్ర మహిళా నాయకురాలు సాయి లీలరెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సత్యసాయి జిల్లా తరలింపు అనేది కొందరి అపోహ మాత్రమే

**పుట్టపర్తి టౌన్, ఆగస్టు 20, ప్రభాతవార్త**

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశీస్సులతో ఏర్పాటైన శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి తరలింపు అనేది కొందరి అపోహ మాత్రమే అని ఆ జిల్లా వాల్మీకి సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షుడు,పుట్టపర్తి పట్టణ టిడిపి కన్వీనర్ బోయ రామాంజినేయులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ బాబా ఆశీస్సులతో సత్యసాయి ట్రస్ట్ సహకారంతో ఈ ప్రాంత ప్రజల అభిప్రాయం మేరకు అందరి మనోభావాలను దృష్టిలో ఉంచుకొని అప్పటి ప్రభుత్వం పుట్టపర్తి సత్యసాయి జిల్లా ఏర్పాటయిందని తెలిపారు. పుట్టపర్తి సత్యసాయి జిల్లా హిందూపురానికి తరలి పోతోందని కొన్ని ప్రభుత్వ వ్యతిరేక మీడియా,కొన్ని పార్టీలు ప్రజల్లో అలజడి రేకెత్తిస్తున్నాయని ,ఇది ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు. తెలుగుదేశం పార్టీ ఈ ప్రాంత ప్రజల మనోభావాలను ఎల్లప్పుడూ గౌరవిస్తుందని ,జిల్లా పుట్టపర్తి లో ఉంటుందనీ నమ్మకం విశ్వాసం మా టిడిపి నాయకులకు ఉందని పేర్కొన్నారు. ఇంకా ఎవరికైనా ఏమైనా సమాచారం ఉంటే స్వయాన సత్యసాయి జిల్లా కలెక్టర్ గారికి రాతపూర్వకంగా తెలియజేయవచ్చునని ఆయన సూచించారు.

# దివ్యాంగుల పెన్షన్లలో అర్హులకు అన్యాయం జరగదు

## - ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, ఆగస్టు 20 ప్రభాతవార్త

వికలాంగుల పెన్షన్ విషయంలో అర్హులైన వారికి ఎటువంటి అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాను. కొంత మంది అర్హులైన పెన్షన్‌లు పొరపాటున ఆగిపోయినట్లు మా దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ అర్హులైన వారి పెన్షన్లు పొరపాటున ఆగిపోయినట్లు మా దృష్టికి వచ్చిందని, వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యలను పూర్తి స్థాయిలో పరిశీలించి తగిన న్యాయం జరుగుతుందన్నారు. కొంత మంది వికలాంగులు, అనర్హులైన వారికి 60 సంవత్సరాలు దాటిన వారికి వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేస్తున్నట్లు, ఇంకా అనర్హుల్లో కొంత మంది వితంతువులు ఉన్నారని వారికి కూడా త్వరలోనే అవకాశం కల్పిస్తామన్నారు. ఎవరైతే అనర్హతలో ఉండి వృద్ధాప్య పెన్షన్‌కి అర్హులో అటు వంటి వారు రీ వెరిఫికేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. 18 సంవత్సరాలు ఉన్నటువంటి దివ్యాంగుల పిల్లల పెన్షన్లను తాత్కాలికంగా నిలుపుదల చేయడమైనదన్నారు. కనుక ప్రస్తుతానికి వీరికి కూడా నోటీసులు ఇ వ్వరన్నారు. ఈ వెరిఫికేషన్ ప్రక్రియ కేవలం అనర్హు లను తొలగించడానికి మాత్రమే చేపట్టడం జరిగిం దని, కానీ అక్కడక్కడ అర్హులైన వారికి అన్యాయం జరిగిందని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే బాధ్యతను మా కూటమి ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. అందుకే అర్హులైన వారికి మరో అవకాశం ఇస్తున్నారు. మీ పరిధిలోని ఎంపిడిఓ కార్యాలయంలో అర్జీ సమర్పిస్తే మళ్లీ పరిశీలించి మీకు న్యాయం చేస్తారన్నా రు. మా ప్రభుత్వం, మా సిద్ధాంతం ఒక్కటే అర్హులైన వారికి వారి హక్కు అయిన పెన్షన్ తప్పకుండా అందుతుందన్నారు.



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

# విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి భవనాలు ఏర్పాటుకు చర్యలు

## ఎమ్మెల్యే అమిలినేని - నాగిరెడ్డిపల్లి మారమ్మ జాతరలో అమిలినేని - ఫ్రీ బస్సు ఎక్కి మహిళను పలకరించిన ఎమ్మెల్యే

బ్రహ్మసముద్రం ఆగస్టు 20 ప్రభాతవార్త రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే శితిలా వస్థలో ఉన్న భవనాలను సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబు దృష్టికి తీసుకెళ్లి అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన భవనాలను పూర్తి చేసి విద్యార్థుల చదువుకు ఇబ్బ ంది లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఉపాధ్యాయులు, విద్యార్థులకు, గ్రామస్థులకు హామీ ఇచ్చారు. బ్రహ్మసముద్రం మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో మారెమ్మ జాతరకు వెళ్లి తిరిగి వస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారి దృష్టికి గొంచిరెడ్డిపల్లి గ్రామస్థులు, ఉపాధ్యాయులు పాఠశాల భవనాలు శితిలా వస్థలో ఉన్నాయని, గ్రామ సమీపంలోనే కొత్త భవనాలు అసంపూర్తిగా నిర్మించి వదిలేశారని తెలుపగ పాఠశాలకు వెళ్లి భవనాలను పరిశీలంచి తప్ప కుండా విద్యాశాఖ అధికారులతో చర్చించి త్వరలోనే అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన భవనాలకు అవసరమైన నిధులు మంజూర య్యేలా చూస్తామని తెలిపారు నాగిరెడ్డిపల్లి గ్రామంలో జరుగుతున్న మారె మ్మ జాతరలో పలు వురు తెదేపా నాయకుల ఇండ్లలో విందుకు హాజరైన ఎమ్మెల్యే నాయకుల ఆతిథ్యం స్వీకరించారు అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళల కోసం ప్రారంభించిన ఉచిత బస్సు ప్రయాణం స్త్రీ శక్తి పథకం గురించి మహిళలను అడిగి వారి సంతోషాన్ని పంచుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు బ్రహ్మ సముద్రం మండలం గొంచి రెడ్డిపల్లి గ్రామంలో ఆర్టీసీ బస్సు రాగ బస్సు ఎక్కి ఉచిత ప్రయాణం ఎలా ఉంది అంటూ మహిళలను అడిగిన ఎమ్మెల్యేకి బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు కూటమి ప్రభుత్వం చాలా బాగా పని చేస్తోందని, చెప్పిన విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమ లు చేసిందని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు ఈ కార్యక్ర మంలో మండల వ్యాప్తంగా ఉన్న ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న దృశ్యం



బస్సులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

# చెన్నంపల్లి గ్రామంలో జడివానలో పర్యటించిన అనంత కలెక్టర్ వినోద్ కుమార్

కంబదూరు, ఆగస్టు 20, ప్రభాతవార్త

కంబదూరు మండలం చెన్నంపల్లి గ్రామంలో జవహర్ లాల్ నెహ్రూ నవోదయ విద్యాలయం నిర్మాణం కొరకు బుధవారం అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ అధికారులతో కలిసి జడివానలో స్థల పరిశీలన చేశారు. పాఠశాలను నిర్మించేందుకు ఆ గ్రామంలో 169,170 సర్వే నెంబర్ల లో అనువుగా ఉన్న 30 ఎకరాల ప్రభుత్వ భూమిని కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ భూమి కి సంబంధించిన రికార్డుల వివరాలను రెవెన్యూ అధికారులు అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. పాళ్యూరులో కుడా కలెక్టర్ పర్యటించి భూమిని పరిశీలించారు . భూ పరిశీలనకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ తిరిగి ప్రయాణం అవుతుండగా మార్గం మధ్యలో కలెక్టర్ వాహనాన్ని ఆ గ్రామ మహిళలు ఆపారు. చాలా రోజుల నుంచి చెన్నంపల్లి గ్రామంలో తాగునీటి సమస్య నెలకొని ఉందని నేటి సమస్యను పరిష్కరిం చాలని మహిళలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. అంతకుమునుపు కంబదూరు చెక్ పోస్ట్ వద్ద కలెక్టర్ వాహనంలో వెళ్తుండగా మండల కేంద్రానికి చెందిన సూర్య బలిజ కులస్తులు కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిశారు. తాము బీసీ కులం కింద కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ కొరకు దరఖాస్తు చేసుకు న్నప్పటికీ తహశీల్దార్ కార్యాలయం అధికారులు కుల దృవీకరణ సర్టిఫికెట్‌ను మంజూరు చేయలేదని కలెక్టర్ వద్ద కొంతమంది సూర్య బలిజ కులస్తులు తమ బాధను వ్యక్తం చేశారు. తహశీ ల్దార్ తో మాట్లాడి కుల ధ్రువీ కరణ సర్టిఫికెట్ మంజూరు అయ్యేల చర్యలు చేపడతామని కలెక్టర్ వారి కి భరోసా ఇచ్చారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ తనిఖీ చేసి పలు భూ రికార్డులను పరిశీలించారు. కంబదూరు తహ శీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుని వర్షానికి నీరు కారు తుందని కార్యాలయ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుం టామని కలెక్టర్ అన్నారు. కంబదూరులో ప్రెస్ క్లబ్ నిర్మాణం కొరకు,జర్న లిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలని జర్నలిస్టులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు . కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, కంబదూరు తహశీల్దార్ బాలకిషన్, తదితర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



నవోదయ పాఠశాల కొరకు చెన్నంపల్లిలో స్థల పరిశీలన చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, అధికారులు



పాళ్ళురు లో భూమిని పరిశీలిస్తున్న కలెక్టర్ నవోదయ పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన కలెక్టర్

# గుండుమల తిప్పేస్వామి ల ఆదేశం మడకశిర చెరువులకు నీరందించేలా చర్యలు తీసుకోవాలి

## ఎమ్మెల్యే రాజు,ఎంపీ పార్థసారధి,మాజీ ఎమ్ ఎల్ సి, గుండుమల తిప్పేస్వామి,

## రైతులు, ప్రజలకు సాగు, తాగునీటి సమస్యలు ఉండకూడదు

మడకశిర టౌన్ ఆగస్టు 20 ప్రభాతవార్త

మడకశిర నియోజకవర్గ చెరువులకు మొదటగా నిరందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని హంద్రీనీవా అధికారులను హిందూపురం పార్లమెంటు సభ్యులు బీకే పార్థసారథి, మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు ఆదేశించారు. బుధవారం అనంతపురం పట్టణం లో ని ఆర్.అండ్.బి గెస్ట్ హౌస్ లో హంద్రీనీవా అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, ఇరిగేషన్ అధికారులు హాజరై మడకశిర నియోజకవర్గ నీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, ఎంపీ పార్థసారథి,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు అధికారులతో మాట్లాడుతూ:ప్రతి ఏటా కృష్ణా జలాలు గొల్లపల్లి రిజర్వాయర్ నుండి హంద్రీనీవా కాలువల ద్వారా చిట్ట చివరన ఉన్న మడకశిర నియోజకవర్గానికి చేరుకోలేక నియోజకవర్గంలోని రైతులు, ప్రజలు సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మొదటగా చిట్ట చివర ఉన్న మడకశిర వైపు నుండి కృష్ణా జలాలను చెరువులకు చేరవేయడానికి తగిన చర్యలు చేపట్టాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర నియోజ కవర్గంలోని కే.గుండుమల గ్రామానికి విచ్చేసినప్పుడు హంద్రీనీవా బైపాస్ కాలువను నిర్మాణం చేపడతామని, రోళ్ల మండలం రత్నగిరి వద్ద, గుడిబండ మండలం రాళ్లపల్లి వద్ద రిజర్వాయర్లను నిర్మిస్తామని అంతేకాకుండా మడకశిర నుంచి రొళ్ల, అగళి మరియు గుడిబండ, అమరా పురం మండలాలకు నిర్మిం చిన కాలువలను వెడల్పు చేసి త్వరితగతిన ప్రతి చెరు వుకి నీరు చేరేలా చర్యలు చేపడతామని వాగ్దానం చేశా రు. ముఖ్య మంత్రి ఆదేశాల మేరకు ఇప్పటికే సంబంధిత అధికా రులతో అంచనాలను సిద్ధం చేసి ముఖ్యమంత్రి కార్యాలయంలో ఇచ్చాం. వాటి ని త్వరలోనే ముఖ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పనులను మంజూరు చేయించేందుకు కృషి చేస్తాం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి త్వరలోనే హంద్రీనీవా జలాలు విడుదల చేసి, చెరువులకు అందించే అంశాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునేందుకు త్వరలోనే ఐ.ఎ.బి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారు అధికారులకు సూచించారు. ఈ సమావే శంలో హంద్రీనీవా ఎస్.ఈ సూపరింటెండెంట్ ఇంజినీరు స్వరూప్, 56,57,58 ప్యాకేజిలకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, డిఇలు, ఏఇలు, కుంచిటిగ, వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీ నారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, ఐదు మండలాల సింగిల్ విండో అధ్యక్షులు, జడ్పీటీసీలు, పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో చర్చిస్తున్న ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్ ఎల్ సి,

# జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం పరిశీలించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి

## - జిల్లా ఎస్పీ పి.జగదీష్

అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 20 ప్రభాతవార్త

ఇటీవల ఎంపికైన స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో శిక్షణార్థులకు అవసరమైన సౌకర్యాలను పరిశీలించేందుకు స్థానిక జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రాన్ని (డి.టి.సి) బుధవారం జిల్లా ఎస్పీ పి.జగదీష్ సందర్శించారు. అనంతరం డి.టి.సి, పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్ లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్ ను పోలీస్ అధికారులతో కలసి పరిశీలించి, శిక్షణ నిమిత్తం అవసరమైన అన్ని ఏర్పాట్లను త్వరితగతిన ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.అలాగే, డిటీసీలో చేపట్టవలసిన మరమ్మత్తు పనులను పరిశీలించిన జిల్లా ఎస్పీ , సంబంధిత పోలీసు అధికారులకు పలు సూచనలు అందించారు. అనంతరం, శిక్షణార్థులకు శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్ మరియు ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే గ్రౌండ్ పరిశీలించారు. రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియా వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. శిక్షణ కేంద్రంలో అదనపు సదు పాయాలను ఏర్పాటు చేసుకో వాలని, మౌలిక వసతుల ఏర్పాటుకి ప్రత్యే క శ్రద్ధ అవసరమని, పరిసరాలను ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచు కోవాలని సూచించారు. జిల్లా ఎస్పీ వెంట డి.టి.సి డి. ఎస్.పి డి.టి.సి సూర్యనా రాయణరెడ్డి, ఏ.ఆర్ డీఎస్పీ నీలకం ఠేశ్వరరెడ్డి, ఆర్ఐ మధు, తదితరులు ఉన్నారు.



జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం పరిశీలించి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలి - జిల్లా ఎస్పీ పి.జగదీష్

# కురసాల సత్యనారాయణ మృతి పట్ల ఆలూరు సాంబశివారెడ్డి ప్రగాఢ సంతాపం

శింగనమల, ఆగస్టు 20 ప్రభాతవార్త

మాజీ మంత్రి కురుసాల కన్నబాబును వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి బుధవారం వ్యక్తిగతంగా కలిసి కురుసాల కన్నబాబు తండ్రి కురుసాల సత్యనారాయణ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సత్యనారాయణ గతంలో కాకినాడ, రూరల్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పని చేసి ప్రజలకు విశేషమైన సేవలు అందించిన విషయాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. సత్యనారాయణ మరణం ఆ ప్రాంత ప్రజలకు తీరని లోటన్నారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులు దైర్యంగా ఉండాలని, దేవుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెద్దాపురం నియోజకవర్గ సమన్వయకర్త దొరబాబు, రామచంద్రాపురం నియోజకవర్గం సమన్వయకర్త పిల్లి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాజీ మంత్రితో మాట్లాడుతున్న ఆలూరు సాంబశివారెడ్డి

# హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం

## - ఈనెల 25 తేదీల్లోగా దరఖాస్తులు పంపాలని వినతి

అనంతపురం, ఆగస్టు 20 ప్రభాతవార్త బ్యూరో

పర్యాటక మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్ మెంట్ కోర్సులకు ఈనెల 25వ తేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవా లని టూరిజం జిల్లా అధికారి శివరామకృష్ణ ఒ ప్రకటనలో తెలిపారు. తిరు పతి కేంద్రములోని భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలచే సంయుక్తంగా నిర్వహించబడుతున్న "స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజి, అప్లైడ్ న్యూట్రిషియన్‌లో 2025-26 సంవత్సరమునకు గాను హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బి.యస్.సి (హెచ్. హెచ్.ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్ 40 శాతం కంటే ఎక్కువ వచ్చిన వారి నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. ఈ కోర్సులో ఎఫ్ అండ్‌బి ప్రొడక్షన్, ఎఫ్‌అండ్‌బి సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్, హౌస్ కీపింగ్ నేర్పించి 4 నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును అని ఆయన వివరించారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ పెటిసరి కోర్సుకు యస్. యస్.సి. పాసైన వారి నుండి ధరఖాస్తులు కోరుచున్నాము. ఈ కోర్సులో ఒక సంవత్సరము పాటు దేశ విదేశాల వంటకములు నేర్పించి 6నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును అని ఆయన తెలిపారు. సర్టిఫికేట్ కోర్స్ ఇన్ ఫుడ్ బేవరేజ్ సర్వీస్ కోర్సుకు యస్.యస్.సి పాసైన వారి నుండి ధరఖాస్తులు కోరుచున్నాము. ఈ కోర్సు లో ఐదు నెలల పాటు రెస్టారెంట్, బార్ సర్వీస్ నేర్పించి 1 నెల ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును అని టూరిజం జిల్లా అధికారి తెలిపారు. పై కోర్సులకు వయో పరిమితి లేదు అని, ఈ కోర్సులు పూర్తి అయిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ హోటళ్ళు, ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించబడును అని ఆయన చెప్పారు. ఈ కోర్సుకు సంబంధించి బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. బాల బాలికలకు వేరువేరుగా హాస్టల్ సదుపాయం కూడా కలదు అని ఆయన చెప్పారు. ఈ సంస్థ యొక్క ధరఖాస్తులు, ఇతర ఏదైనా సమాచారం కొరకు సెల్ నెం. 9701343846, 9100558006, 9700440604లో సంప్రదించవలెను అని ఆయన చెప్పారు. పూరించిన ధరఖాస్తులను నిర్ణయించిన తేదీలోగా కాలేజీలకు పంపాలని అడ్మిషన్స్ ఇన్చార్జి, డిస్ట్రిక్ట్ టూరిజం ఆఫీసర్ శివరామకృష్ణ వెల్లడించారు.

# దివ్యాంగుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళాం

## జిజిహెచ్ సూపరింటెండెంట్ ఆత్మారామ్

అనంతపురం వైద్యం ఆగస్టు 20 ప్రభాతవార్త

ఫించన్ రి వెరిఫికేషన్ లో భాగంగా దివ్యాంగులు చాలామంది వారి వైకల్యానికి అనుగుణంగా ధ్రువీకరణ అందలేదని అంశాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లామని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ ఆత్మారామ్ తెలిపారు. బుధవారం ఆయన చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ అధికారులతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డిఎం అండ్ హెచ్ ఓ డి సి హెచ్ ఎస్ ఆసుపత్రి సూపరింటెండెంట్ లవీడియో కాన్ఫరెన్స్ జరిగిందని ఇందులో అనంతపురం జిల్లా సంబంధించి స్థానిక పరిస్థితులను ఉన్నతాధికారులకు వివరించమని వారు వద్ద నుండి కొన్ని సూచనలు సలహాలు అందాయని తెలిపారు ఇందులో భాగంగా పింఛను అర్హత సాధించని లబ్ధిదారులు తమ గ్రీవెన్స్ దరఖాస్తును డి ఆర్ డి ఏ పీడీకి గాని ఎంపీడీవో కార్యాలయంలో కానీ అందజేసి ఆన్లైన్ వెరిఫికేషన్‌కు నమోదు చేసుకుని అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు త్వరలో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు వెలువడుతాయని పేర్కొన్నారు. పింఛను వెరిఫికే షన్ లో డాక్టర్ల నిర్లక్ష్యం ఏమాత్రం లేదని ఈ విషయాన్ని లబ్ధిదారులు గమనించా లని సూచించారు ప్రభుత్వ ఆదేశాను సారం వైద్యులు తమ విధి నిర్వహణ మాత్రమే నిర్వహించాలని ఇందులో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని తెలియజేశారు.



మాట్లాడుతున్న జిజిహెచ్ సూపరింటెండెంట్ ఆత్మారామ్

# దోమల నియంత్రణకు చర్యలు తీసుకుందాం

## ప్రపంచ దోమల దినోత్సవ సభలో ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విష్ణుమూర్తి

అనంతపురం వైద్యం ఆగస్టు 20 ప్రభాతవార్త

దోమల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుందామని జిల్లా ఇన్చార్జి వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ విష్ణుమూర్తి అన్నారు ప్రపంచ దోమల దినోత్సవ సభలో పాల్గొన్న ఆయన తొలిత సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మాట్లాడుతూ దోమ కాటు ద్వారా పరాన జీవులు మానవులకు మలేరియా వ్యాధిని వ్యాపింప చేస్తాయి అని ప్రపంచానికి తెలియజేసిన సర్ రోనాల్డ్ రాస్ గురించి స్మరించుకున్నారు. ప్రస్తుత వర్షాకాల సీజన్ నందు దోమల ఉధృతి పెరిగి మలేరియా డెంగీ చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అందరూ దోమల పుట్టుక, పెరుగుదల వాటి వల్ల వచ్చే జబ్బుల గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారు వ్యాధులకు గురి కాకుండా కృషి చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్ రావు, ఇంచార్జ్ డెమో త్యాగరాజు, డాక్టర్ సురేంద్ర రెడ్డి, హెచ్ ఈ ఈ ఓ నాగరాజు, డిప్యూటీ హెచ్‌ఈవో గంగాధర్, మలేరియా కార్యాలయం విస్తరణ అధికారి గిరిధర్ రెడ్డి, సబ్ యూనిట్ అధికారులు మద్దయ్య, అబ్దుల్ మునాఫ్, రమేష్,సూపర్వైజర్లు నూరు భాష, శ్రీధర్ మూర్తి, రమేష్, రాఘవేంద్రారెడ్డి, లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

# నూతన మూల్యాంకన విధానాన్ని ఉపసంహరించుకోవాలి

## - ఏపీటీఎఫ్ నేతల డిమాండ్

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 20 ప్రభాతవార్త

నూతన మూల్యాంకన విధానాన్ని ఉపసంహరించుకోవాలని జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల నుండి వస్తున్న ప్రాతినిధ్యం దృష్ట్యా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సి .రాజుద్దీన్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు డిఈఓ దగ్గర మాట్లాడుతూ.. పాఠశాలల పరీక్షల నిర్వహణలో మూల్యాంకన పుస్తకాలను సరఫరా చేసి అమలు చేస్తున్న కొత్త విధానం వల్ల అనేక కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ పని అంతయు పనివేళలో జరగాల్సిన బోధన సమయాన్ని హరించి వేసే విధంగా ఉంటూ విద్యార్థులకు తీరని నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. అన్ని పుస్తకాలను ఉపాధ్యాయులు ఇంటికి తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది, కావున అసెస్మెంట్ బుక్లెట్ విధానాన్ని ఉపసంహరించుకొని సాధారణ మూల్యాంకన విధానాలనే కొనసాగి ంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సి.రాజు ద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్ వలి, రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు ఈజీ నాగభూషణం, రంగనాయకులు, పుల్లయ్య, హిమగిరి, ప్రసాద్, తిప్పేస్వామి, పర్వతయ్య, రామాంజనేయులు, మహేష్, ఖలిముల్లా రామ్మూర్తి, సుహేల్, మన్సూర్, బిఎన్ శ్రీనివాసులు, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



డిఇఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏపిటిఎఫ్ నేతలు

# వీధి వ్యాపారులను గుర్తంచి గుర్తింపు కార్డులిచ్చి జీవనోపాధికి సహకరించండి

## -వీధి వ్యాపారుల సమీక్షా సమావేశంలో కమిషనర్ బాలస్వామి

అనంతపురం ఆగస్టు20 ప్రభాతవార్త

నగరంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే వారిని గుర్తించి వారికి గుర్తింపు కార్డులు అందజేయడంతో పాటు నగరంలో ఆయా అనువైన పరిసర ప్రాంతాలను గుర్తించి విక్రయాలు చేయడానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందని నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి పిలుపునిచ్చాడు. బుధవారం కమిషనర్ ఛాంబర్‌లో వీధి వ్యాపారుల సంఘం నాయకులతో సమీక్షా సమావేశాన్ని ఆయన నిర్వహించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రధాన వీధుల్లో ఇరువైపుల ఎక్కడ పడితే అక్కడ తోపుడు బండ్లు, చిన్న చిన్న బంకులు వంటివి ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తునా న్నరని, దీనివల్ల పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఒక్కొక్క సారి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ఇలాంటి తరుణంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యాపారుల జీవనోపాధి కోసం ఆయా పరిసర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను గుర్తించి వారికి కేటాయించి ఇటు జీవనోపాధిని మెరుగు పరచడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఈ సమావేశంలో వీధి వ్యాపారుల సంక్షేమ సంఘం నాయకులు, ఆరోగ్య అధికారి రంగస్వామి, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ మంజుల, సాంకేతిక నిపుణుడు కాటమయ్య, కమ్యూనిటి ఆర్గనైజర్లు, వీధి వ్యాపారుల సంక్షేమ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



వీధి వ్యాపారుల సంక్షేమ సమావేశానికి హాజరైన అధికారులు, సంఘం నాయకులు

# ముందుకు సాగని గృహనిర్మాణాలు..!

( మొదటి పేజీ తరువాయి ) మాత్రమే పూర్తి అయ్యాయి. ఇంకా 4159 గృహ నిర్మాణాలు పూర్తి కావాల్సివుంది. రాష్ట్రంలో జిల్లా 16వ స్థానంలో వుంది. మిగిలిన గృహనిర్మాణాలు పూర్తి చేయడానికి కేవలం తొమ్మిది రోజులు మాత్రమే గడువు వుంది. సంబంధిత శాఖ జిల్లా, డివిజన్, మండల అధికారులు మాత్రం వర్షకాలం కావడంతో పనులు జరగడం లేదని, కూలీలు కూడా సక్రమంగా రావడం లేదు, తదితర కారణాలను చెబుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం రెండు నెలలు గడువు పొడిగించింది. అయినా కూడా గృహనిర్మాణాలను ముందుకుసాగడం లేదు. దీంతో లక్ష్యానికి చేరుకోవడానికి కేవలం తొమ్మిది రోజులు మాత్రమే గడువు ఉండటంతో ఏమి చేయాలో దిక్కుతోచక అధికారులు, ఉద్యోగులు తలలు పీక్కుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో గృహనిర్మాణాల లక్ష్యం నేరవేరుతుందా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

**లక్ష్యానికి చేరుకుంటాంః గృహనిర్మాణశాఖ పీడీ శైలజ :** జిల్లాలో 9711 గృహాలను గత ఏడాది జూన్ నుండి ఈ ఏడాది జూన్ పదో తేదీ నాటికి నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం ఇచ్చింది. ఆ గడువును ఆగస్టు నెలాఖర్ వరకు పొడిగించింది. ఇప్పటి వరకు 5552 గృహనిర్మాణాలు పూర్తి అయ్యాయి. ఇంకా 4159 గృహనిర్మాణాలు పూర్తి కావాల్సివుంది. నెలాఖర్‌లోపు లక్ష్యానికి చేరుకోవడానికి చర్యలు తీసుకుంటున్నాం.

# గీత కులాలకు రెండు బార్లు కేటాయింపు - ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి

అనంతపురం వైద్యం ఆగస్టు 20 ప్రభాతవార్త

కొత్తగా బార్లు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ లో భాగంగా గీతకులాలకు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో రెండు బార్లు ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశామని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు సాధారణ కేటగిరీలో 55 లక్షలు గా ఉన్న ఫీజు గీతకులాలకు 27.5 ఫీజుగా నిర్ణయించబడిందని కావున ఆసక్తి ఉన్న ఈడుగకులస్తులు బార్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.